సాక్షి
విశాఖపట్నం

శుక్రవారం । 19 । మే । 2023




‘మత్తు’ ముఠా.. ఆటకట్టు

నిషేధిత మత్తు ఇంజక్షన్లు విక్రయిస్తున్న ముఠాను విశాఖ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, సెబ్ అధికారులు అరెస్టు చేశారు. 8లో



గైడ్‌లైన్స్ అనుసరించాలి

ఓటర్ల జాబితా లక్ష్యాలను అధిగమించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా కోరారు. 8లో



అప్పన్న హుండీ ఆదాయం లెక్కింపు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం రూ.1,89,90,670 వచ్చినట్టు ఈవో వి.త్రినాథరావు తెలిపారు. 8లో

న్యూస్‌రీల్

ఏయూకు మరొక ఐపీ గుర్తింపు



వీసీ ప్రసాద రెడ్డికి ఉత్తర్వులు అందజేస్తున్న ఆచార్య జేమ్స్ స్టీఫెన్

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయంనుంచి వచ్చిన ఒక ఆవిష్కరణకు మేధో హక్కుల గుర్తింపు లభించింది. వాటర్ ఫిల్టర్ కాట్రిడ్జ్ డిజైన్‌కు గాను ఐపీ గుర్తింపు లభించింది. దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు ఏయూకు అందాయి. ఈ సందర్భంగా దీనికి రూపకల్పన చేసిన వారిని వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. వర్సిటీ తరఫున వాటర్ ఫిల్టర్ కాట్రిడ్జ్ డిజైన్‌ను గుర్తింపు అందించారు. ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ , కె.వెంకట కిరణ్, కె.రాజ్ కుమార్‌లు డిజైన్‌రూపకల్పన చేయడం జరిగింది. వీరి డిజైన్‌ను రిజిస్ట్రేషన్ చేస్తూ అధికారిక ఉత్తర్వులను భారత ప్రభుత్వం ది పేటెంట్ ఆఫీస్ జారీ చేసింది. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఐపీఆర్ చెయిర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్లస్ టూ స్కూళ్ల పీజీటీలకు కౌన్సెలింగ్

విశాఖ విద్య : ఉమ్మడి విశాఖ జిల్లాలోని హైస్కూల్ ప్లస్–2 స్కూళ్లలో పీజీటీలుగా స్కూల్ అసిస్టెంట్లను నియమించేందుకు శనివారం ఉదయం 11గంటలకు డీఈవో కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈవో ఎల్. చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా శుక్రవారం కౌన్సెలింగ్ అని ప్రకటించామని, అయితే దీనిని శనివారానికి మార్పు చేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు ఈ మార్పును గమనించాలని సూచించారు. ధ్రువీకరణ పత్రాల పరిశీలన శుక్రవారం విశాఖ డీఈవో కార్యాలయంలో ఉంటుందన్నారు.

దూరవిద్య కేంద్రం పరీక్షల నోటిఫికేషన్ విడుదల

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం నుంచి నిర్వహించే యుజి, పి.జి, ప్రొఫెషనల్, డిప్లమా, పీజీ డిప్లమా, కంప్యూటర్ సర్టిఫికెట్ కోర్సుల పరీక్షల నోటిఫికేషన్ విడుదల చేసినట్లు దూరవిద్య కేంద్రం ఇంచార్జి సంచాలకులు ఎం.వి.ఎస్ చంద్రశేఖర రావు తెలిపారు. 2020–21, 2021–22, 2022–23 విద్యాసంవత్సరంలో ప్రవేశం పొందిన వారు 2017–18 విద్యా సంవత్సరం తరువాత చేరిన బ్యాక్‌లాగ్‌లు ఉన్న విద్యార్థులు సైతం ఈ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. జూన్ 10వ తేదీలోగా ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ 500 అపరాధ రుసుంతో జూన్ 15వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. రూ.2000 అపరాధ రుసుముతో జూన్ 20వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. పరీక్షలకు దరఖాస్తులను ఆన్‌లైన్ విధానంలో మాత్రమే స్వీకరిస్తామన్నారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్ www.andhrauniversity.sde.com , 0891 2844163, 2844164,2754966 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పరీక్షల తేదీలు

డిగ్రీ మూడో సంవత్సరం, ఎంబీఏ, ఎంసీఏ మూడో సంవత్సరం పరీక్షలు జూలై 3వ తేదీ నుంచి ఉదయం 9 నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తారు. డిగ్రీ ద్వితీయ సంవత్సరం, ఎంబీఏ, ఎంసీఏ, ఇతర పీజీ కోర్సుల ద్వితీయ సంవత్సరం పరీక్షలు జూలై 3వతేదీ నుంచి మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తారు. ప్రథమ సంవత్సరం యూజీ, పీజీ, డిప్లమా, పీజీ డిప్లమా, సర్టిఫికెట్ కోర్సుల పరీక్షలు జూలై 18 నుంచి మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తారు.

21న అఖిలభారత ఆదివాసీ సదస్సు

డాబాగార్డెన్స్: దేశంలోని వివిధ ప్రాంతాల్లో గిరిజనులపై పెరుగుతున్న దాడులు ఎదుర్కొనేందుకు వివిధ రాష్ట్రాలకు చెందిన ఆదివాసీ సంఘాల నాయకులతో ఈ నెల 21న విశాఖలో అఖిల భారత ఆదివాసీ సదస్సు నిర్వహించనున్నట్లు ఆదివాసీ జాతీయ సదస్సు నిర్వహణ కమిటీ ప్రతినిధులు కేదార్ సబర(ఒడిశా), డి సురేష్, ముక్తి సత్యం (తెలంగాణ) తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మా భూమి, జీవనోపాధిని, మా అస్తిత్వాన్ని కాపాడుకోవడం, అడవులను రక్షించుకోవడం లక్ష్యంగా ఈ సదస్సు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఆదివాసీ సమూహాలపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో సదస్సులో పలు తీర్మానాలు చేయనున్నట్టు తెలిపారు. డాబాగార్డెన్స్‌లో గల అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించనున్న జాతీయ సదస్సుకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, జార్ఖండ్, పశ్చిమబెంగాల్, బీహార్, యూపీ, ఈశాన్య రాష్ట్రాలైన త్రిపుర, మణిపూర్ నుంచి ఆదివాసీ సంఘాల నాయకులతో పాటు 750 మందికి పైగా నాయకులు, కార్యకర్తలు పాల్గొంటున్నట్టు తెలిపారు.

స్కూల్ బస్సులకు ‘ఫిట్‌నెస్’

- ప్రారంభమైన సామర్థ్య పరీక్షలు
- జిల్లాలో వెయ్యికి పైగా బడి బస్సులు
- విద్యాసంస్థలు తెరిచే నాటికి ఫిట్‌నెస్ తప్పనిసరి
- అప్పటికీ చేయించని పక్షంలో కేసుల నమోదు



స్కూలు బస్సుకు ఫిట్‌నెస్ పరీక్ష నిర్వహిస్తున్న రవాణా శాఖ సిబ్బంది

సాక్షి, విశాఖపట్నం : బడి పిల్లలకు పరీక్షలు ముగిశాయి. వీరితో పాటు పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవులు వచ్చాయి. ఏడాదిలో పది నెలల పాటు విద్యార్థులను విద్యా సంస్థలకు తీసుకెళ్లిన స్కూలు బస్సులు ఇప్పుడు పరీక్షలకు సిద్ధమవుతున్నాయి. విద్యార్థినీ, విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని కాలేజీలు, బడులు తిరిగి తెరుచుకునే సమయానికి ఈ బస్సులు విధిగా ఫిట్‌నెస్ (సామర్థ్య) పరీక్షలు పూర్తి చేసుకోవలసి ఉంది. ఇందులో భాగంగా ఈ నెల 16 నుంచి ఆయా విద్యా సంస్థల బస్సులు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవడం మొదలు పెట్టాయి. జిల్లాలో వెయ్యికి పైగా స్కూలు బస్సులున్నాయి. ఆనందపురం మండలం గంభీరంలో ఉన్న రవాణా శాఖ మైదానానికి ఈ బస్సులు చేరుకుంటున్నాయి. అక్కడ రవాణా శాఖ సిబ్బంది వీటికి సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. నిబంధనల ప్రకారం బస్సు కండిషన్‌తో పాటు సీట్లు, లైట్లు, కిటికీల పక్కన గ్రిల్స్ వంటి వాటిని వీరు పరిశీలిస్తారు. అన్ని సవ్యంగా ఉన్నాయని నిర్ధారణ అయ్యాక ఆ బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. పాఠశాలలు జూన్ రెండో వారం నుంచి పునఃప్రారంభమవుతాయి. జూనియర్, ఇంజినీరింగ్ కాలేజీలు ఒకింత ఆలస్యంగా తెరుచుకుంటాయి. అందువల్ల పాఠశాలల బస్సులను ముందుగా ఫిట్‌నెస్ కోసం ఆయా యాజమాన్యాలు పంపుతున్నాయి. విద్యాసంస్థలు తెరచుకునే నాటికి ఫిట్‌నెస్ చేయించుకుంటేనే ఆ బస్సును రోడ్లపైకి అనుమతిస్తారు. లేనిపక్షంలో రవాణా శాఖ అధికారులు ఆ బస్సును సీజ్ చేస్తారు.

బస్సులకు ఇవి తప్పనిసరి..

మోటార్ వాహన చట్టం 1988 ప్రకారం ప్రతి వాహనానికి ఫిట్‌నెస్ తప్పనిసరి. దీంతో పాటు ఇతర నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. అవి..

- స్కూలు బస్సు వయసు పరిమితి 15 ఏళ్లు దాటకూడదు
- డ్రైవరుకు ఐదేళ్లకు పైగా అనుభవం ఉండాలి
- స్కూలు బస్సు డ్రైవరుతో పాటు మరొక సహాయకుడు తప్పనిసరి
- సీట్ల దిగువన స్కూలు బ్యాగులు ఉంచుకునే సదుపాయం ఉండాలి
- యాజమాన్యం విధిగా బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్సు అందుబాటులో ఉంచాలి
- సీట్ల కిటికీల పక్కన హారిజాంటల్‌గా గ్రిల్స్ అమర్చాలి
- అత్యవసర ద్వారంతో పాటు అగ్నిమాపక పరికరాలుండాలి

స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం



పాఠశాలలు, కాలేజీలు తెరచుకున్నాక రోడ్డెక్కే స్కూలు బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి. ఫిట్‌నెస్ చేయించుకోకుండా రోడ్లపైకి వచ్చే బస్సుల కోసం ప్రతి రోజూ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం. ఫిట్‌నెస్ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా తిరిగే బస్సులను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తాం. విద్యా సంస్థల యాజమాన్యాలు తమ బస్సులను సెలవులకు ముందే సామర్థ్య పరీక్షలు నిర్వహించుకోవాలి.

– జీసీ రాజారత్నం, డీటీసీ, విశాఖపట్నం

చాట్‌బాట్‌తో సెల్‌ఫోన్ల రికవరీ

- రూ.60 లక్షల విలువ గల 100 సెల్‌ఫోన్లు స్వాధీనం
- బాధితులకు అందించిన సీపీ త్రివిక్రమ్ వర్మ



స్వాధీనం చేసుకున్న సెల్ ఫోన్లు

అల్లిపురం : పోయిన సెల్ ఫోన్లు రికవరీ కోసం నగర పోలీసులు రూపొందించిన చాట్‌బాట్ వెబ్ పోర్టల్ సత్ఫలితాలు ఇస్తోందని నగర పోలీస్ కమిషనర్ సీఎం త్రివిక్రమ్ వర్మ తెలిపారు. ఈ పోర్టల్ ద్వారా గతంలో 200 మొబైల్స్ రికవరీ చేసి బాధితులకు అప్పగించామన్నారు. ప్రస్తుతం రూ.60 లక్షల విలువల గల 100 సెల్ ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందజేశామని చెప్పారు. గురువారం, సూర్యాబాగ్‌లో నగర పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు.

ఎలా ఫిర్యాదు చేయాలి..

మొబైల్ పోగొట్టుకున్న వారు వాట్సప్ నంబరు (9490617916)కి హాయ్ అని పంపాలన్నారు. వెంటనే ఒక లింక్‌తో కూడిన స్వీయ ప్రత్యుత్తరం వస్తుందన్నారు. ఆ లింక్‌పై క్లిక్ చేసి ఫారమ్‌లో ఖాళీలను నింపడం ద్వారా ఫిర్యాదు నమోదవుతుందన్నారు. ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయకుండా, పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులును పర్యవేక్షించేందుకు ఎస్.ఐ స్థాయి అధికారితో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లు నిరంతరాయంగా పని చేస్తున్నారన్నారు. వారు టెక్‌సెల్ డేటా సహాయంతో అన్ని సాంకేతిక కోణాల్లో విశ్లేషించి, నగర పరిధిలోను, రాష్ట్ర పరిధిలోను, రాష్ట్ర వెలుపల ఉన్న ప్రాంతాల్లో బాధితులు పోగొట్టుకున్న మొబైల్స్ తిరిగి రికవరీ చేయడం జరుగుతుందన్నారు. సీసీఎస్ సిబ్బంది పోయిన మొబైల్స్ వినియోగిస్తున్న వారితో మాట్లాడి వారి నుంచి మొబైల్స్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే చాలా మంది బాధితులు పోగొట్టుకున్న సెల్‌పోన్లను అందజేశారు. చాట్‌బాట్ యాప్ వినియోగంతో సత్ఫలితాలు సాధిస్తున్నట్టు నగర పోలీసు కమిషనర్ త్రివిక్రమ్ వర్మ పేర్కొన్నారు. అనంతరం రికవరీ చేసిన మొబైల్స్‌ను మొబైల్ పోగొట్టుకున్న వారికి ధ్రువపత్రాలు పరిశీలించి అప్పగించారు. ఈ సమావేశంలో సీసీఎస్ సీఐలు ఆర్.సత్యనారాయణ, ఎస్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

21న బాలలకు ‘సాక్షి’ చిత్రలేఖనం పోటీలు



దొండపర్తి (విశాఖ దక్షిణ): సాక్షి దినపత్రిక ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన బాలలకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో రెండు కేటగిరీలలో 10 ఏళ్లలోపు, అలాగే 10 నుంచి 16 ఏళ్లలోపు విద్యార్థులకు ఈ పోటీలు ఉండనున్నాయి. జూనియర్స్ విభాగంలో ‘సేవ్ వాటర్’, సీనియర్ విభాగంలో ‘బ్యూటీ ఆఫ్ వైజాగ్’ థీమ్‌పై పోటీలు జరగనున్నాయి. ఆసక్తి ఉన్న బాలలు ఈ నెల 20వ తేదీలోగా అక్కయ్యపాలెం సంఘం ఆఫీస్ ప్రాంతంలో ఉన్న సాక్షి కార్యాలయంలో గానీ, 8121703348 ఫోన్ నంబర్‌కు గానీ సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలి. డ్రాయింగ్‌కు అవసరమైన షీట్లు, ఇతర సామగ్రిని విద్యార్థులే వెంట తీసుకురావాల్సి ఉంటుంది. ఇందులో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు కన్సొలేషన్ ప్రైజులు కూడా అందించనున్నారు.

డీవీఎస్‌కు చందు సాహితీ పురస్కారం



డీవీ సూర్యారావుకు చందు పురస్కారం ప్రదానం చేస్తున్న దాడి వీరభద్రరావు, కె.ఎస్.చలం

సీతంపేట: ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ డీవీ సూర్యారావు సాహిత్యంలో నిష్ణాతులని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు కొనియాడారు. చందు సాహితీ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పౌరగ్రంథాలయంలో జరిగిన సభలో ఆచార్య కె.ఎస్.చలంతో కలిసి డి.వి.సూర్యారావుకు చందు సాహితీ పురస్కారాన్ని , పదివేల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాహిత్య అభిలాష ఉన్న వారంతా ఒకప్పుడు వరహాలశెట్టి బుక్ సెంటర్‌లో కలిసేవారని గుర్తుచేశారు. అధ్యయనంలో మేటిగా నిలిచిన డాక్టర్ డి.వి.సూర్యారావు ఉత్తరాంధ్రకు గర్వకారణమన్నారు. డి.వి.సూర్యారావు రచయితగా ఒక వర్గానికే పరిమితం కాకుండా సమాజంలోని ఉన్న వివిధ కోణాలను తన రచనల్లో ఆవిష్కరించారని తెలిపారు. చదవడం కంటే రాయడం చాలా గొప్ప ప్రక్రియ దానిని సాధించడంలో సూర్యారావు విజయం సాధించారని ప్రశంసించారు. సాహితీవేత్తలు, నటులు, చలన చిత్ర, సాంస్కృతిక, సేవా , రాజకీయ రంగంలో ఉన్న నిష్ణాతుల గురించి తన రచనలు, వ్యాసాల ద్వారా సమాజానికి పరిచయం చెయ్యడం గొప్ప విషయమన్నారు. నేటి సమాజంలో ఉన్న చెడును స్పష్టంగా చెప్పగలిగే రచయితలు, రచనలు అవసరమన్నారు. పుస్తకం గొప్పదని, గ్రంథాలయాలు కనుమరుగవుతున్నాయని, వాటి పరిరక్షణకు సాహితీవేత్తలు నడుంబిగించాలన్నారు. సాహితీవేత్త చందు సుబ్బారావు మాట్లాడుతూ సాహితీవేత్తలను తాము ప్రోత్సహిస్తామని తెలిపారు. డాక్టర్ పి.గోపాలనాయుడు పురస్కార గ్రహీతను సభకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, ఆచార్య వెలమల సిమ్మన్న, మేడా మస్తాన్‌రెడ్డి, అడపా రామకృష్ణ, ఎల్.ఆర్.స్వామి, శేఖరమంత్రి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

5న తపాలాశాఖ పెన్షన్ అదాలత్

ఎంవీపీకాలనీ: తపాలా ఉద్యోగుల పెన్షన్ సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారానికి జూన్ 5వ తేదీన ఎంవీపీ కాలనీలోని రీజినల్ కార్యాలయంలో పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్టు పోస్టల్ రీజనల్ కార్యాలయం అకౌంట్స్ ఆఫీసర్ పి.సత్యంరాజు గురువారం తెలిపారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన వారి సమస్యలను ఈ అదాలత్‌లో పరిష్కరించనున్నారు. వారి ఫిర్యాదులను ఈ నెల 31వ తేదీలోపు ఎంవీపీ కాలనీలోని పోస్టుమాస్టర్ జనరల్ రీజినల్ కార్యాలయం చిరునామాకు అందజేయాలన్నారు. అనంతరం జూన్ 5వ తేదీ జరిగే అదాలత్‌లో వాటిని పరిష్కరించనున్నట్లు తెలిపారు.

జ్యోతికి మరో స్వర్ణం

విశాఖ స్పోర్ట్స్ : జాతీయ ఫెడరేషన్ కప్ సీనియర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో విశాఖ అథ్లెట్ జ్యోతి ఎర్రాజీ మరోస్వర్ణాన్ని కైవసం చేసుకుంది. రాంచీలోని బిర్సాముండా స్టేడియంలో గురువారం జరిగిన మహిళల 200 మీటర్ల పరుగును 23.42 సెకన్లలో గమ్యాన్ని చేరి జ్యోతి (ఆంధ్రప్రదేశ్) విజేతగా నిలిచి స్వర్ణాన్ని అందుకుంది. అర్చన సుసేన్ (తమిళనాడు) 23.61సెకన్లలోనూ, హిమాని చందల్ (మధ్యప్రదేశ్) 24.33 సెకన్లలో పూర్తి చేసి వరుసగా ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచారు. సిమ్రాన్‌దీప్ కౌర్ (ఢిల్లీ), దనేశ్వరి (కర్నాటక), అంజలి(కేరళ), మధుమిత (ఒడిస్సా), శుభమ్ (హర్యానా) వరుసగా నాలుగో స్థానం నుంచి ఎనిమిదో స్థానాల్లో నిలిచారు. ప్రిలిమ్స్ హీట్‌లో జ్యోతి 23.47సెకన్లలో పూర్తి చేసి ఫైనల్స్‌కు క్వాలిఫై అయింది. జాతీయ రికార్డు హోల్డర్ జ్యోతి బుధవారం జరిగిన వంద మీటర్ల హర్డిల్స్‌ను 12.89 సెకన్లలోనే పూర్తి చేసి స్వర్ణం సాధించిన విషయం విదితమే. దీంతో జ్యోతి పాల్గొన్న రెండు అంశాల్లో స్వర్ణాలందుకుంది.

రేపు ఏయూ-ఐఓసీఎల్ స్టార్టప్ ఫండ్ పిచింగ్ ప్రోగ్రాం

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంయుక్తంగా ఈ నెల 20న ఐఓసీఎల్ స్టార్టప్ ఫండ్ పిచింగ్ ప్రోగ్రాంను నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఏయూ సెనేట్ మందిరంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. కార్యక్రమంలో ఐఓసిఎల్ రీసెర్చ్–డెవలప్‌మెంట్ విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఎస్.వి రామ్ కుమార్ పాల్గొంటారు. ఈ సందర్భంగా ఐఓసీఎల్ అందించే స్టార్టప్ పథకాలు, ఆర్థిక ప్రయోజనాలు వివరిస్తారు. విద్యార్థులకు, పరిశోధకులకు, ఆచార్యులకు పరిశోధన ప్రాజెక్టులు అందించే అంశాలపై చర్చిస్తారు. హైడ్రో కార్బన్ రంగంలో నూతన స్టార్టప్‌లను సాధించే దిశగా అవకాశాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి పాల్గొంటారు.

జిల్లాలో 9,560 మంది

వలంటీర్లకు సత్కారం

- నేడు అవార్డుల ప్రదానోత్సవం
- డీఎల్‌డీవో పూర్ణిమాదేవి



సాక్షి, విశాఖపట్నం : ప్రభుత్వ సంక్షేమ పథకాలను, కార్యక్రమాలను గడప గడపకూ చేరవేస్తూ పారదర్శకంగా సేవలందిస్తున్న గ్రామ, వార్డు వలంటీర్లను వరుసగా రెండో ఏడాది సత్కరించనున్నట్లు జిల్లా సచివాలయాల అధికారి, డీఎల్‌డీవో పూర్ణిమాదేవి తెలిపారు. కలెక్టర్ డా.మల్లికార్జున, జేసీ విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆధ్వర్యంలో ఈ వేడుకలను వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ థియేటర్‌లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వలంటీర్లను సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులతో సత్కరించడంతో పాటు నగదు బహుమతి, ప్రశంసా పత్రాలను అందజేసేందుకు ఇప్పటికే ఏర్పాట్లు చేశామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన మూడు నెలల వ్యవధిలోనే 2019 ఆగస్టు 15వతేదీన వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టారన్నారు. నిరంతరాయంగా సేవలందిస్తూ.. వలంటీర్లు అన్ని వర్గాల ప్రజలకు చేరువయ్యారని తెలిపారు. వలంటీర్ల సేవలకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం 2021 నుంచి సత్కార కార్యక్రమాలను ప్రారంభించిందని, ఇందులో భాగంగా ఈ ఏడాది జిల్లాలో అత్యుత్తమ సేవలందిస్తున్న 9,560 మంది వలంటీర్లకు అవార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. సచివాలయంలో బయోమెట్రిక్ హాజరు, పింఛన్ల పంపిణీ, పథకాల్ని ప్రజల్లో తీసుకెళ్లే తీరు, వివిధ సంక్షేమ పథకాల సర్వే తీరు అంశాల ఆధారంగా వలంటీర్లకు పాయింట్లు కేటాయించి మూడు విభాగాల్లో అవార్డులు అందిస్తున్నట్లు వివరించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 10,249 మంది వలంటీర్లు విధులు నిర్వర్తిసుండగా.. ఇందులో 31 మంది వలంటీర్లకు సేవా వజ్ర అవార్డును, 107 మందికి సేవారత్న, 9,422 మందికి సేవా మిత్ర అవార్డును అందజేస్తున్నట్లు పూర్ణిమ తెలిపారు. కలెక్టర్, జేసీ, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో అవార్డు గ్రహీతలైన వలంటీర్ల ఎంపిక ప్రక్రియను నిర్వహించినట్లు వెల్లడించారు. శుక్రవారం జరిగే అవార్డు ప్రదానోత్సవంలో జిల్లాకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకానున్నారని డీఎల్‌డీవో పూర్ణిమాదేవి తెలిపారు.

కేజీహెచ్‌లో పిల్లల వార్డు తనిఖీ



పిల్లల వార్డును తనిఖీ చేస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ కుమార్

మహారాణిపేట: ఎండల తీవ్రత నేపథ్యంలో పిల్లల వార్డును కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ గురువారం తనిఖీ చేశారు. అధిక ఉష్ణోగ్రతలు, వడగాడ్పుల నేపథ్యంలో వార్డులో ఏసీలు పనిచేస్తున్నాయా? లేదా అన్నది తనిఖీ చేశారు. వార్డులో అన్ని ఏసీల పనితీరును సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ కుమార్ పరిశీలించారు. అలాగే అలాగే ఎస్‌ఐసీయూ విభాగంలో ఫీడింగ్ ఇచ్చే పిల్లల తల్లుల కోసం రికవరీ రూమ్ ఏర్పాటు చేశారు. అక్కడ తల్లులకు అవసరమయ్యే మ్యాట్స్‌ను కూడా కేజీహెచ్ ఎఆర్‌ఎంవో డాక్టర్ అనురాధ పరిశీలించారు.

మహిళల పాలిట సైతాన్ చంద్రబాబు

ఎమ్మెల్సీ వరుదు కల్యాణి



విశాఖపట్నం: చంద్రబాబు విశాఖ పర్యటనను జనం పట్టించుకోవడం లేదన్న ఫ్రస్టేషన్‌తో రాష్ట్రంలో పేద మహిళలను అవమానించేలా మాట్లాడుతున్నారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ, పార్టీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వరుదు కల్యాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏ మహిళా కుటుంబం కూడా నిలువ నీడ లేకుండా ఉండకూడదన్న గొప్ప ఉద్దేశంతో సొంత అన్నదమ్ముడిలా, పుట్టింటి నుంచి ఆస్తి ఇచ్చినట్లు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్ల పట్టాలిచ్చి ఇళ్లు కట్టిస్తున్నారని తెలిపారు. అది చూసి ఓర్వలేక అహంకారంతో, అసహనంతో పేద మహిళలకు ఇచ్చే ఇళ్ల స్థలాలు ఇళ్లు కట్టుకోడానికి కాకుండా.. చనిపోయాక పూడ్చడానికి సరిపోతాయని మాట్లాడడం చాలా దారుణ విషయమన్నారు. రాష్ట్రంలో ఉన్న 32 లక్షల మంది పేద మహిళలకు చంద్రబాబు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు ప్రతిపక్ష నాయకుడా? లేక పేదల పాలిట ప్రతినాయకుడా? అని ప్రశ్నించారు. అతనికి లింగమనేని రమేష్ లాంటి వాళ్లు కరకట్ట మీద అక్రమ నివాసాలను బహుమతిగా ఇస్తారని, కానీ రాష్ట్రంలో పేద మహిళలకు అటువంటి పరిస్థితి ఉండదన్నారు. సెంటు భూమి అంటే వెటకారం కాదని, ప్రతి ఆడబిడ్డ సెంటిమెంట్ అన్న విషయాన్ని గ్రహించాలని హితవుపలికారు. ఈ సెంటు భూమిలో తెలుగు దేశం పార్టీని మహిళలు సమాధి చేయడం ఖాయమని హెచ్చరించారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు ఒక్క పేద మహిళకు అయినా ఇళ్ల పట్టా ఇచ్చారా? అని ప్రశ్నించారు. ఈ ఇళ్ల పట్టాల కోసం మాట్లాడే అర్హత చంద్రబాబుకు లేదన్నారు. మహిళలకు ఎన్టీఆర్ ఆస్తి హక్కు కల్పిస్తే.. సీఎం జగన్ ఏకంగా మహిళలకు ఆస్తినే ఇస్తున్నారని పేర్కొన్నారు. అమరావతిలో పేదలు ఉండడానికి వీల్లేదని కోర్టుకు వెళ్లి అడ్డుకున్న నీచమైన పార్టీ తెలుగుదేశం అని అన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని పోరాటం చేయాల్సిన ప్రతిపక్ష టీడీపీకి ఇస్తున్న ఇళ్లను అడ్డుకోవాలని కుట్రలు చేయడం సరికాదని హితవు పలికారు. విశాఖలో కూడా 1.5 లక్షల మంది పేద మహిళలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారని గుర్తు చేశారు. కానీ ప్రభుత్వం న్యాయ పోరాటం చేసి అందరికీ పట్టాలిచ్చిందన్నారు. చంద్రబాబు ఇంకోసారి ఇళ్ల స్థలాల విషయంలో మహిళలను కించపరిచేలా మాట్లాడితే వారి ఆగ్రహం చవిచూడక తప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలో ఉన్న 32 లక్షల మంది మహిళలు తమ ఇంటికి తీసే పునాదుల్లో ఈ తెలుగుదేశం పార్టీని కూడా పాతిపెట్టాలన్నారు పలుపునిచ్చారు. చంద్రబాబు మహిళల పాలిట సైతాన్ అని, మహిళా ద్రోహిగా అభివర్ణించారు.

గ్రేహౌండ్స్ భూ పరిహారం విడుదల

ఆనందపురం : మండలంలోని జగన్నాథపురంలో గ్రేహౌండ్స్ నిర్మాణానికి భూములు అందించిన రైతులకు ప్రభుత్వం పరిహారం మంజూరు చేసింది. ఇక్కడి సర్వే నంబరు 1/1లో గ్రేహౌండ్స్, ఆక్టోపస్ శిక్షణ కేంద్రం కోసం 385 ఎకరాల భూమిని రెండేళ్ల క్రితం ప్రభుత్వం సేకరించింది. అందులో 11.84 ఎకరాలు డీ పట్టా భూములు, 4సీ రికార్డుల్లో నమోదైన 25.03 ఎకరాలు, ఆక్రమణలు 90.26 ఎకరాలు ఉన్నాయి. మొత్తం 91 మంది రైతులకు పరిహారం కింద రూ.15.96 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు రైతులకు చెక్కులు రూపంలో పరిహారం అందించడానికి అధికారులు ఏర్పాటు చేస్తున్నారు.

మన్యంలో కొలువుదీరనున్న శ్రీనివాసుడు

- 22న ఆలయ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు
- టీటీడీ ఎగిక్యూటివ్ అధికారి ఏవీ ధర్మారెడ్డి
- 21 వరకు మహా సంప్రోక్షణ



హోమం నిర్వహిస్తున్న టీటీడీ అర్చకులు

రంపచోడవరం: మండలంలో ఐ.పోలవరం జంక్షన్ సమీపంలోని మెట్టపై కలియుగదైవం శ్రీనివాసుడు కొలువుదీరనున్నారు. ఈమేరకు ఆలయ ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తిరుమల తిరుపతి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ అధికారి ఏవీ ధర్మారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలోని గిరిజన ప్రాంత ప్రజలకు వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు లభించేలా ఈనెల 22వ తేదీన ఆలయాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. దీనిలో భాగంగా ఈనెల 17వ తేదీ నుంచి ప్రారంభమైన మహా సంప్రోక్షణ 21వ తేదీ వరకు జరుగుతుందన్నారు. మరుసటిరోజు 22వ తేదీన ఆలయాన్ని ప్రారంభించిన అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పిస్తామని తెలిపారు. అదేరోజు సాయంత్రం ఐదు గంటల నుంచి స్వామివారి కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. ఈ ఉత్సవానికి భక్తులు హాజరు కావచ్చని ఆయన తెలిపారు. ఆలయ ప్రారంభంపై టీటీడీ ఏర్పాటు చేసిన వాహనం ద్వారా ఈనెల 17నుంచి గిరిజన గ్రామాల్లో విస్తృత ప్రచారం చేపట్టినట్టు ఆయన పేర్కొన్నారు.

టీటీడీ అర్చకుల ఆధ్వర్యంలో..

మహా సంప్రోక్షణలో భాగంగా టీటీడీ అర్చకులు వేద మంత్రాల మధ్య హోమం, పూజలు నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు పంచగవ్యప్రాసన, వాస్తు హోమం, అకల్మష ప్రాయశ్చిత్త హోమం, రక్షాబంధనం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు అగ్ని ప్రతిష్ట, కుంభ స్థాపన, కుంభారాధన, విశేష హోమాలు జరిగాయి. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవోలు గుణభూషణ్ రెడ్డి, వెంకటయ్య, శివప్రసాద్, శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, డీఈ ఆనందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ మేకపాటి ఏయూ సందర్శన



మేకపాటికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: ప్రముఖ పారిశ్రామికవేత్త, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి గురువారం ఏయూను సందర్శించారు. వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద్‌రెడ్డితో ఏయూ సెనేట్ మందిరంలో సమావేశమయ్యారు. నాలుగేళ్లుగా ఏయూలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి వీసీ.. మేకపాటికి వివరించారు. అనంతరం ఇక్కడ మహాబోధి ఇంటర్నేషనల్ మెడిటేషన్ సెంటర్‌ను వీసీతో కలసి మేకపాటి సందర్శించారు. ఈ సందర్భంగా మేకపాటి మాట్లాడుతూ జాతీయస్థాయిలో ప్రతిష్టాత్మకంగా ఏయూను తీర్చిదిద్దుతున్న వీసీని అభినందించారు. ఏయూ అభివృద్ధికి తనవంతు సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం వీసీ మేకపాటిని సత్కరించారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఆచార్య జేమ్స్ స్టీఫెన్, ఆచార్య పి.డి సత్యపాల్, ఎం.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.89 కోట్లు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం గడిచిన 29 రోజులకు రూ.1,89,90,670 వచ్చినట్టు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. సింహగిరిపై ఆలయ బేడా మండపంలో గురువారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. నగదుతో పాటు 124.600 గ్రాముల బంగారం, 14.565 కిలోల వెండి లభించినట్టు తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన లెక్కింపులో దేవస్థానం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. శుక్రవారం కూడా లెక్కింపు కార్యక్రమం ఉంటుందని ఈవో తెలిపారు.

'మత్తు' ముఠా.. ఆటకట్టు

- నిషేధిత మత్తు పదార్థాలు విక్రయిస్తున్న ఐదుగురి అరెస్ట్
- మిగిలిన వారి కోసం పోలీసుల గాలింపు
- భారీ సంఖ్యలో ఇంజక్షన్లు స్వాధీనం

అల్లిపురం: ప్రత్యేక పరిస్థితుల్లో.. వైద్యుల సూచన మేరకు మాత్రమే వినియోగించాల్సిన మత్తు ఇంజక్షన్లు నగరంలో కొంత మంది విక్రయిస్తుండటంతో.. పోలీసులు అప్రమత్తమయ్యారు. నిషేధిత మత్తు ఇంజక్షన్లు విక్రయిస్తున్న ముఠాపై ఎప్పటికప్పుడు దాడులు చేస్తూ.. అరెస్ట్‌లు చేస్తున్నారు. తాజాగా వేర్వేరు కేసుల్లో టూటౌన్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు, సెబ్ అధికారులు ఐదుగురిని అరెస్ట్ చేశారు. పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నగర పోలీస్ కమిషనర్ సీఎం త్రివిక్రమ్ వర్మ ఈ వివరాలు వెల్లడించారు. సమావేశంలో డీసీపీ-1 విద్యాసాగర్ నాయుడు, క్రైం డీసీపీ జి.నాగన్న పాల్గొన్నారు.

- కోల్‌కతా నుంచి పెంటాజోసిన్ లాక్టేట్ ఇంజక్షన్లు మధ్యవర్తుల ద్వారా గుంటు ఉమామహేష్ రూ.40కి కొనుగోలు చేసి.. నగరంలో రూ.60 నుంచి రూ.300 వరకు విక్రయిస్తున్నాడు. ఈ సమాచారం మేరకు సీతమ్మధార, పెందుర్తి సెబ్ అధికారులు దాడులు చేసి సీతమ్మధార కనకపువీధిలో 3 వేల మత్తు జంక్షన్లతో 60 బాక్సులను ఉమామహేష్ నుంచి స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు కోల్‌కతాకు చెందిన బీమాల్‌ను అరెస్ట్ చేయాల్సి ఉందని సీపీ తెలిపారు.
- పీఎంపాలెం, మధురవాడలో 100 పెంటాజోసిన్ లాక్టేట్ ఇంజక్షన్లతో రెండు బాక్స్‌లను నిందితుడు బెవర వెంకటేష్ నుంచి పెందుర్తి సెబ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అతనికి ఖరగ్‌పూర్‌కు చెందిన దుర్గాప్రసాద్ ఈ ఇంజక్షన్లు సరఫరా చేస్తున్నాడు. ఇటీవలే అతన్ని మహారాణిపేట, గోపాలపట్నం పోలీసులు రెండు కేసుల్లో అరెస్ట్ చేసి జైలుకు పంపించారు. అతను బెయిల్‌పై విడుదల అయినట్లు తెలిపారు.
- సీతమ్మధార, పీఎంపాలెం పోలీస్‌స్టేషన్ల పరిధిలో మత్తు ఇంజక్షన్లకు అలవాటు పడిన 14 మందిని అదుపులోకి తీసుకుని.. 'మార్పు' సెంటర్ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించారు.



వివరాలు వెల్లడిస్తున్న సీపీ త్రివిక్రమ్ వర్మ, చిత్రంలో డీసీపీ-1 విద్యాసాగర్ నాయుడు, క్రైం డీసీపీ నాగన్న

టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో..

టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రైల్వేక్వార్టర్స్‌లో మత్తు ఇంజక్షన్లు విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, టూటౌన్ పోలీసులు దాడి చేశారు. నిందితుడు కాళ్ల హరి పద్మ రాఘవరావు, పబ్బితి రవి, కాకటా చిరంజీవిలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 42 బాక్సుల్లోని 2,100 పెంటాజోసిన్ లాక్టేట్ ఇంజక్షన్లు, 21 కేజీల గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లు, రూ.7 వేలు నగదు స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు.

ఈ కేసులో పితాని అప్పలరాజ అలియాస్ చిన్నా, పితాని రవి, శ్యామ్, వానపల్లి జగదీష్‌లను అరెస్ట్ చేయాల్సి ఉందన్నారు. వీరికి బీమాల్ కండేవాలా మత్తు ఇంజక్షన్లు సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. కాళ్ల హరి పద్మ రాఘవరావు అలియాస్ భీమిలి హరిపై భీమిలి పోలీస్ స్టేషన్‌లో ఐదు, గోపాలపట్నం సెబ్‌లో ఒకటి, రాజమండ్రి వన్‌టౌన్ పీఎస్‌లో ఒకటి, టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఓ కేసు నమోదైంది. పబ్బిత్ రవికుమార్‌పై టూటౌన్, ఎంవీపీ పోలీస్ స్టేషన్లలో పలు కేసులు నమోదయ్యాయని సీపీ తెలిపారు.

7,546 కిలోల గంజాయి స్వాధీనం

విశాఖ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో 2019 జనవరి 1వ తేదీ నుంచి 2023 మే 17వ తేదీ వరకు 191 కేసుల్లో 7546.23 కిలోల గంజాయి, 27.4 కిలోల హషీష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకుందని సీపీ సీఎం త్రివిక్రమ్ వర్మ తెలిపారు. ఈ కేసుల్లో 473 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. మత్తు పదార్థాల నియంత్రణలో సెబ్ పనితీరును ఆయన వివరించారు. 257 మంది గంజాయి రవాణా చేస్తున్నట్లు గుర్తించి వారిలో 200 మందిని అరెస్ట్ చేశామని, 49 మందిని డీ అడిక్షన్ కేంద్రాల ద్వారా కౌన్సెలింగ్ ఇచ్చామని వెల్లడించారు. మత్తు ఇంజక్షన్లు సరఫరా చేస్తున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన అనూప్ అధికారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. మత్తు మందులకు దూరంగా ఉండాలని నగరంలో 146 హోర్డింగ్‌లు ఏర్పాటు చేశామన్నారు. యూనివర్సిటీలు, ఇంజినీరింగ్, డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించినట్లు చెప్పారు. పాఠశాలలు, కళాశాలల్లో హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్ల చైర్మన్లుగా 105 కమిటీలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పరివర్తన కార్యక్రమంలో భాగంగా 9 గ్రామాల ప్రజలను గంజాయి సాగు నుంచి మళ్లించి.. సంప్రదాయ పంటలు సాగు చేసేలా ప్రోత్సహించినట్లు సీపీ వివరించారు.

ఉన్నత్ భారత్ అభియాన్‌కు అనిట్స్ ఎంపిక



ఏయూ వీసీ ప్రసాదరెడ్డితో అనిట్స్ బృందం

తగరపువలస: సంగివలస అనిట్స్ కళాశాల.. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉన్నత్ భారత్ అభియాన్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కె.శ్రీరామకృష్ణ తెలిపారు. కళాశాల సమీప గ్రామాల్లో సర్వే నిర్వహించినప్పుడు నమ్మివానిపేట గ్రామస్తులకు సోలార్, తాగునీటి అవసరాలు గుర్తించి.. ఐఐటీ–ఢిల్లీ మార్గదర్శకాల ప్రకారం ఆ వసతులు కల్పించామన్నారు. ఈ మేరకు గురువారం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉపకులపతి పి.వి.జి.డి ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్ చేతుల మీదుగా రూ.2 లక్షల ప్రోత్సాహకం అందుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ప్రాంతీయ సమన్వయకర్తగా డాక్టర్ బి.పావని వ్యవహరించగా నోడల్ అధికారి నాగరాజు, యూబీఏ సమన్వయకర్త సత్యనారాయణ, సహ సమన్వయకర్త బిందు సీహారిక పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వినతి



సజ్జలకు వినతిపత్రం అందిస్తున్న ఎన్‌ఎంయూఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

మద్దిలపాలెం: ఆర్టీసీ విలీన ప్రక్రియలో కొన్ని అంశాలు పరిష్కారం కాలేదని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డిని గురువారం తాడేపల్లిలో కలిసి వినతిపత్రం సమర్పించారు. విలీన ప్రక్రియలో పొందుపరిచిన అంశాల పరిష్కారంతో త్వరలో ఉద్యోగ విరమణ చేసే వారికి ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని శ్రీనివాసరావు తెలిపారు. అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

'అటవీ' బిల్లుతో జాతి ప్రయోజనాలకు విఘాతం



నిరసన తెలుపుతున్న ఏపీ విదసం ఐక్యవేదిక

దాబాగార్డెన్స్: అటవీ ప్రాంతం నుంచి గిరిజనులను బయటకు తరిమేసి.. అటవీ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్రతో తెచ్చిన అటవీ సంరక్షణ బిల్లును తక్షణమే వెనక్కి తీసుకోవాలని విదసం ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన అటవీ సంరక్షణ బిల్లుకు వ్యతిరేకంగా.. గురువారం దాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం వద్ద విదసం ఐక్యవేదిక ఆధ్వర్యంలో బిల్లు ప్రతులు చించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1996 పీఈఎస్ఏ చట్టం ప్రకారం పంచాయతీ తీర్మానం లేనిదే ఏ ప్రాజెక్టు చేపట్టరాదన్నారు. ఈ బిల్లు ఆమోదం పొందితే, 2006 అటవీ హక్కుల చట్టం, పీసా చట్టం, 1/70 చట్టం, అస్తిత్వం కోల్పోయి అడవి ప్రైవేట్ వ్యాపార కేంద్రంగా మారిపోతుందన్నారు. జాతి సంపదను అదానీ..అంబానీకి దోచి పెట్టేందుకు ప్రధాని మోదీ ఎత్తుగడని దుయ్యబట్టారు. అటవీకరణ ముసుగులో షెడ్యూల్ ఏరియాలో కార్పొరేట్ల చొరబాటు ఆపాలన్నారు. ఈ బిల్లు రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధమని, 2023 ఫారెస్ట్ చట్టం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్.ఆర్.వేమన అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సోడదాసి సుధాకర్, వడ్లమూరి ఫ్రాన్సిస్, కోల హరిబాబు, నిర్మల, ఎస్.రాజేంద్రప్రసాద్, డి.అప్పారావు, ఎస్.నూకరాజు, రాంప్రభు, కె.ప్రసాదరావు, వై.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ గైడ్‌లైన్స్ అనుసరించాలి

మహారాణిపేట: రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల జాబితాలకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా కలెక్టర్లను కోరారు. గురువారం అన్ని జిల్లాల డీఈవోలు, కలెక్టర్లతో వర్చువల్ విధానంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎంల సరఫరాను జూన్ నుంచి ప్రారంభించి సెప్టెంబర్ నాటికి పూర్తిస్థాయిలో అందజేస్తామన్నారు. ఇప్పటి వరకు స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి ఈ నెల 25లోగా తదుపరి ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున, డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్‌రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఎన్నికల సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గిస్తాం

జీవీఎంసీ అధికారులతో సీపీ త్రివిక్రమ్ వర్మ సమీక్ష



సమావేశంలో పాల్గొన్న సీపీ త్రివిక్రమ్ వర్మ, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

అల్లిపురం: నగరంలో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీస్ కమిషనర్ సీఎం త్రివిక్రమ్ వర్మ.. జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, జోనల్ కమిషనర్లతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. నగర పోలీస్ కమిషనరేట్ కాన్ఫరెన్స్ హాలులో ఈ కార్యక్రమం జరిగింది. ట్రాఫిక్ రద్దీకి కారణమవుతున్న ఫుట్‌పాత్, రోడ్డు ఆక్రమణలు, ముఖ్య కూడళ్లలో ప్రకాశవంతమైన లైటింగ్, జీబ్రా క్రాసింగ్, రోడ్ సేఫ్టీ స్టిక్కర్ల ఏర్పాటు తదితర అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా.. ట్రాఫిక్ రద్దీ తగ్గేందుకు తీసుకోవాల్సిన చర్యలపై జీవీఎంసీ కమిషనర్‌తో చర్చించినట్లు చెప్పారు. జీవీఎంసీ, ఎల్‌అండ్‌టీతో కలసి నగరంలో నిర్వహిస్తున్న 232 సీసీ కెమెరాలకు మరమ్మతులు అవసరమన్నారు. చీకటిగా ఉండే ముఖ్య కూడళ్లలో ప్రకాశవంతమైన లైటింగ్ ఏర్పాటుతో రోడ్డు ప్రమాదాలు తగ్గే అవకాశం ఉందన్నారు. ప్రధాన కూడళ్లు, అవసరమైన చోట బారికేడ్లు, స్పీడ్ బ్రేకర్లు, సీసీ టీవీ కెమెరాల ఏర్పాటుపై కార్యాచరణ రూపొందించి.. జీవీఎంసీ సమన్వయంతో పూర్తి చేసేందుకు నిర్ణయించినట్లు చెప్పారు. సమీక్షలో జోనల్ కమిషనర్లు, డీసీపీలు, ఏసీపీలు, ట్రాఫిక్ సీఐ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుడి మృతదేహం లభ్యం



అప్పలరాజు

ఉక్కునగరం: అదృశ్యమైన స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్‌కు చెందిన కాంట్రాక్ట్ కార్మికుడు వనమాడ అప్పలరాజు (50) శవమై కనిపించాడు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు తెలిపిన వివరాలివీ.. వనమాడ అప్పలరాజు (50) సోమవారం విధులకు వెళ్లి మధ్యాహ్నం నుంచి కనిపించలేదు. సాయంత్రం అతను ఇంటికి చేరక పోవడంతో ఆయన బావమరిది యరబాల అశోక్‌కుమార్ అదే రోజు రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. గురువారం సాయంత్రం స్టీల్‌ప్లాంట్ లేబర్ గేట్ రహదారిలో వెతుకుతున్న పోలీసులకు దుర్వాసన రావడం గమనించి లోపలకు వెళ్లి చూశారు. అక్కడ స్టీల్‌ప్లాంట్ హెల్మెట్ ధరించి ఉన్న అప్పలరాజు మృతదేహం బయటపడింది. వెంటనే స్టీల్‌ప్లాంట్ ఎస్‌ఐ డి.వరలక్ష్మి సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. అతని ఒంటిపై ఎటువంటి గాయాలు లేవు. బ్లాస్ట్‌ఫర్నేస్ నుంచి నడిచి వస్తూ వడదెబ్బకు గురై మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు

- 14 ఏళ్ల సీఎంగా ఒక్క పథకాన్ని అయినా ప్రవేశపెట్టాడా?
- విశాఖకు చేసిందేమిటో చెప్పే ధైర్యముందా?
- చంద్రబాబు ఇచ్చిన జీవో కారణంగానే పంచగ్రామాల భూ సమస్య
- పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



మాట్లాడుతున్న పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్

దొండపర్తి: అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ నారా చంద్రబాబు అని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఎద్దేవా చేశారు. మద్దిలపాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు తన హయాంలో ఒక్క సంక్షేమ పథకమైనా ప్రవేశపెట్టాడా? అని ప్రశ్నించారు. 2014 ఎన్నికలకు ముందు ఇచ్చిన 600 హామీల్లో ఒక్కటైనా నెరవేర్చామని చెప్పే ధైర్యం చంద్రబాబుకు ఉందా? అని సవాలు విసిరారు. ఇపుడు ఏ మొహం పెట్టుకొని ప్రజల్లోకి వస్తున్నారని మండిపడ్డారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చేసినవి, అధికారంలోకి వస్తే ప్రజలకు ఏం చేస్తారో చెప్పకుండా కేవలం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిట్టడానికి, ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడానికే చంద్రబాబు యాత్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2019 ఎన్నికలకు ముందు నవరత్నాలు పేరుతో ఇచ్చిన హామీలను సీఎం జగన్ నెరవేర్చారని ధైర్యంగా చెప్పే సత్తా వైఎస్సార్ సీపీకి ఉందని తెలిపారు. భోగాపురం విమానాశ్రయానికి తాము శంకుస్థాపన చేసినట్లు చెప్పుకుంటున్న చంద్రబాబు.. అసలు ఎయిర్‌పోర్ట్‌కు అనుమతులు లేకుండా, నిర్మాణానికి టెండర్లు పిలవకుండా, కాంట్రాక్టర్‌ను ఖరారు చేయకుండా ఏ విధంగా శంకుస్థాపన చేశారని ప్రశ్నించారు. 2019 ఎన్నికలకు కేవలం మూడు నెలల ముందు ప్రజలను మభ్య పెట్టడానికే ఇటువంటి ఇలా శిలాఫలకాలు వేశారని పేర్కొన్నారు.

చంద్రబాబే పెద్ద సైకో

చంద్రబాబులాంటి సైకో రాష్ట్రంలో మరొకరు లేరని అదీప్‌రాజ్ ఆరోపించారు. టీడీపీ హయాంలో ఒక్కరికైనా ఇంటి పట్టా ఇవ్వకపోగా.. ముఖ్యమంత్రి జగన్ పేదలకు ఇస్తున్న ఇళ్లపై దుష్ప్రచారాలు చేయడం సరికాదని హితవుపలికారు. కులం, మతం, పార్టీ చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలు అందించినట్లు వెల్లడించారు. ఒక్క పెందుర్తిలోనే సుమారు 23 వేల మంది ఇళ్ల పట్టాలు అందజేసినట్లు వివరించారు. ఇందులో మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి గ్రామానికి చెందిన ఆ పార్టీ అధ్యక్షుడిగా కూడా పట్టా ఇచ్చామని చెప్పారు. నియోజకవర్గంలో రూ.1,629 కోట్ల మేర సంక్షేమ పథకాలను ప్రజలకు అందించామన్నారు. అలాగే రూ.2,584 కోట్ల చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి 70 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. 8 యూపీహెచ్‌సీలు, రూ.8 కోట్లతో పాలిటెక్నిక్ కళాశాల నిర్మాణాన్ని చేపట్టినట్లు వెల్లడించారు.

చంద్రబాబు జీవో వల్లే పంచ గ్రామాల సమస్య

వాస్తవానికి పంచగ్రామాల సమస్య చంద్రబాబు హయాంలో తీసుకువచ్చిన జీవో కారణంగానే తలెత్తిందని గుర్తు చేశారు. తాజాగా ఆ సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో ఉన్నారని పేర్కొన్నారు. కోర్టులో ఉన్న ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి, ఆయా గ్రామాల్లో భూమికి ప్రత్యామ్నాయంగా గాజువాక పరిధిలో రూ.2 వేల కోట్ల విలువైన భూమిని ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని కోర్టుకు విన్నవించి త్వరలోనే పంచగ్రామాల సమస్య పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు.

చంద్రబాబు విశాఖకు చేసిందేమిటి?

చంద్రబాబు తన హయాంలో విశాఖ చేసిందేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇక్కడ ఉన్న ఫార్మాసిటీ, ఐటీ సెజ్.. ఇలా విశాఖ అభివృద్ధికి బాటలు వేసిందని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అని గుర్తు చేశారు. విశాఖ అభివృద్ధి కోసం ఎప్పుడు కనీస ఆలోచన చేయని చంద్రబాబు ఇపుడు విశాఖ రాజధాని కాకుండా కుట్ర పన్నుతున్నారని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు అధికంగా ఉన్న ఉత్తరాంధ్ర అభివృద్ధిని అడ్డుకోడానికి చంద్రబాబు విశ్వప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నోటి కొచ్చినట్లు మాట్లాడితే ఇకపై ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

మత్స్యకారులకు మేలు చేసింది మేమే..

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రతిపక్ష నేత చంద్రబాబు

సింహాచలం: రాష్ట్రంలో 20 లక్షల మంది మత్స్యకార కుటుంబాలు ఉంటే.. వేట నిషేధ రోజుల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం లక్ష మందికి మాత్రమే జీవనభృతి అందజేస్తోందని, మిగతా కుటుంబాలకు ఆంక్షలు పెట్టిందని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విశాఖ పర్యటనలో భాగంగా చంద్రబాబు గురువారం వేపగుంట సమీపంలోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో మత్స్యకారులు, టిడ్కో ఇళ్ల బాధితులతో వేర్వేరుగా ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించారు. మత్స్యకారులతో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వేట నిషేధ కాలంలో జీవనభృతి ఇచ్చే పథకాన్ని ప్రవేశపెట్టింది తెలుగుదేశం ప్రభుత్వమే అన్నారు. ఏడాదికి మత్స్యకారులకు రూ.750 కోట్లు ఖర్చు చేశామన్నారు. జీవో నంబర్ 30 తీసుకొచ్చి మత్స్యకారుల జీవనోపాధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గండి కొట్టిందన్నారు. తెలుగుదేశం అధికారంలోకి రాగానే డీజిల్ సబ్సిడీని రూ.15కు పెంచుతామన్నారు. 217 జీవోలో పెట్టిన ఆంక్షలు తొలగించి పూర్తి హక్కులు మత్స్యకారులకు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఒక్క బీసీకి కూడా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి న్యాయం చేయలేదని విమర్శించారు. పేదల సొంతింటి కల నిజం చేయడానికి ఆధునిక సదుపాయాలతో టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టామన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. మాజీ మంత్రులు బండారు సత్యనారాయణ, కొల్లు రవీంద్ర, 96, 97, 98 కార్పొరేటర్లు పీలా శ్రీను, సేనాపతి వసంత, పి.వి.నరసింహం తదితరులు పాల్గొన్నారు.

రుణాల మంజూరుకు సహకరించండి



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

బ్యాంకర్లకు జీవీఎంసీ కమిషనర్ విజ్ఞప్తి

దాబాగార్డెన్స్: టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు త్వరితగతిన రుణాలు మంజూరు చేయాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ వివిధ బ్యాంకుల అధికారులకు విజ్ఞప్తి చేశారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం జీవీఎంసీ పరిధిలోని అన్ని బ్యాంకుల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ త్వరలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దబ్బంద, సత్యనారాయణపురంలోని టిడ్కో ఇళ్లు ప్రారంభిస్తారని, ఈ నెలాఖరులోగా లబ్ధిదారులందరికీ బ్యాంకు రుణాల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారులందరూ పేదవారే కాబట్టి.. నిబంధనల పేరిట ఆంక్షలు విధించకుండా రుణాలు మంజూరుకు సహకరించాలన్నారు. ఫేస్-1లో నిర్మిస్తున్న మిగిలిన టిడ్కో ఇళ్లకు జూన్ 15లోపు రుణాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. లబ్ధిదారుల వివరాల జాబితాను జీవీఎంసీ అధికారులు బ్యాంకులకు అందజేస్తారని చెప్పారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులందరూ లబ్ధిదారులకు రుణాలు మంజూరుకు సహకరిస్తామని కమిషనర్‌కు హామీ ఇచ్చారు. సమావేశంలో జీవీఎంసీ ప్రాజెక్టు డైరెక్టర్(యూసీడీ) పాపునాయుడు, సెంట్రల్ బ్యాంకు, యూనియన్ బ్యాంకు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్ లీడ్ మేనేజర్లు, రీజనల్ మేనేజర్లు పాల్గొన్నారు.